వార్త నిర్భయం లో రిపోర్టర్లు కావలెను
సమాజం పట్ల అవగాహన, ప్రజా సమస్యలను ఎత్తిచూపగలిగే చైతన్యం ఉన్నవారికి ఇదే ఆహ్వానం
తెలంగాణ& ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా పనిచేసేందుకు విలేకరులు కావలెను
సంచలనాల కథనాలతో సరికొత్త జర్నలిజం విలువలతో మీడియారంగంలో కొత్త శకం.. వార్తను వార్త లాగారాసే దమ్మున్న జర్నలిజంతో. చైర్మన్ .ఎడిటర్ కాడేపాగు అశోక్ నేతృత్వంలో
సంప్రదించవల్సిన పోన్ నెం: 9949490828

తెలుగు దినపత్రిక
వార్త నిర్భయం
సామాన్యుని చేతిలో సామాజిక అస్త్రం!
www.vaarhtanirbhayam.com
ఎడిటర్ కాడేపాగు అశోక్
ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ

తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్ సంపుటి : 01 సంచిక : 185 చీఫ్ ఎడిటర్: కాడేపాగు అశోక్ పేజీలు : 04, వెల రూ. 4రూ/ సోమవారం- 01 - జూన్ - 2026
Published From Kurnool : Circulated at `Kurnool Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram,

లబ్ధిదారులకు గుడ్ న్యూస్.. త్వరలోనే చేతికి సొంతింటి తాళాలు..

రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న టిడ్కో గృహాల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం రూ.273.79 కోట్ల నిధులను విడుదల చేస్తూ పరిపాలన అనుమతులు మంజూరు చేసింది.

ఆంధ్రప్రదేశ్‌లో సొంత ఇంటి కలను సాకారం చేసుకునేందుకు ఎదురుచూస్తున్న వేలాది మంది లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న టిడ్కో గృహాల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.ఇందులో భాగంగా ఇళ్ల నిర్మాణ పనులను పూర్తి చేయడంతో పాటు, ఆయా హౌసింగ్ సముదాయాలలో మిగతా..2లో

తెలంగాణలోని పలు జిల్లాలకు వర్ష సూచన, ఈదురు గాలుల హెచ్చరిక!

తెలంగాణలోని పలు జిల్లాలకు భారీ వర్ష సూచన జారీ

ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

గత కొన్ని రోజులుగా తీవ్ర భానుడి భగభగలతో అల్లాడిపోతున్న రాష్ట్ర ప్రజలకు ఈ వర్షాలు పెద్ద ఉపశమనం కలిగించనున్నాయి.

హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలంగాణలోని పలు జిల్లాలకు భారీ వర్ష సూచన జారీ చేసింది. నైరుతి రుతుపవనాల రాక మరియు వాతావరణంలో ఏర్పడిన మార్పుల నేపథ్యంలో రేపు ఉదయం వరకు నిజామాబాద్, జగిత్యాల, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, మిగతా..2లో

బతికున్నంత కాలం బీఆర్ఎస్‌లోనే

- బతికున్నంత కాలం బీఆర్ఎస్‌లోనే ఉంటానని..
- బీఆర్ఎస్‌లోనే ఉంటానని కేసీఆర్‌పై ఒట్టేసి చెప్పాలని చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు.
- నా పుట్టుక బీఆర్ఎస్‌లో .. చావుకూడా బీఆర్ఎస్‌లోనని హరీష్ రావు స్పష్టం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మైండ్ గేమ్ పాలిటిక్స్ ఆడుతూ ప్రతిపక్షంలో గందరగోళం సృష్టించాలని చూస్తున్నారని,

హైదరాబాద్: తికున్నంత కాలం బీఆర్ఎస్‌లోనే ఉంటానని.. నా పుట్టుక బీఆర్ఎస్‌లో .. చావుకూడా బీఆర్ఎస్‌లోనని హరీష్

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే మా లక్ష్యం

- విద్యే అభివృద్ధికి తొలి కొలబద్ద అని, పేదరిక నిర్మూలనతో పాటు సమాజాన్ని జాగృతం చేసే శక్తి విద్యకే ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.
- ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి విద్యారంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

హైదరాబాద్, మే 31 : విద్యే అభివృద్ధికి తొలి కొలబద్ద అని, పేదరిక నిర్మూలనతో పాటు సమాజాన్ని జాగృతం చేసే శక్తి విద్యకే ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి విద్యారంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. విద్యాశాఖ బాధ్యతలను స్వయంగా తానే చేపట్టానని తెలిపారు. గత రెండేళ్లలో విద్యారంగంలో పలు సంస్కరణలు అమలు చేసినట్లు వెల్లడించారు.

ఆ విషయం చిట్‌చాట్‌లో చెప్పడం కాదు... అధికారికంగా ప్రకటించాలి: కవిత డిమాండ్

- రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌పై చిట్‌చాట్‌లో కాకుండా అధికారికంగా ప్రకటించాలన్న కవిత
- రైతు డిస్కం పేరుతో మిగతా డిస్కంలను ప్రైవేటీకరించేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపణ
- ఈ ప్రైవేటీకరణ కుట్రను అడ్డుకునేందుకు సుప్రీంకోర్టు వరకు వెళతామని హెచ్చరిక

హైదరాబాద్ :రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అంశంపై మీడియా చిట్‌చాట్‌లో మాట్లాడటం కాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారికంగా ప్రకటించాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని మిగతా..2లో

విశాఖ ఎయిర్ పోర్టు కూడా ఉండాల్సిందే

- ★ప్రస్తుతం ఉన్న విశాఖ ఎయిర్‌పోర్టును పూర్తిగా మూసివేస్తారనే ప్రచారంపై
- ★విశాఖ నుంచి భోగాపురం వెళ్లడం కంటే వందే భారత్ రైలు ఎక్కి విజయవాడ వెళ్లడమే సులువనే పరిస్థితి రాకూడదంటే..

తోటి దేశద్రోహ సోరోస్ ఏజెంట్లతో అసలు విషయాలు బయటపెట్టే సంభాషణ జరిపా

- సీబీఎస్ ఈ వివాదంపై కాంగ్రెస్ ధ్వజం- కేంద్రంలోని మోదీ సర్కార్‌పై తీవ్ర విమర్శలు
- మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నించినవారు సమాధానాలకు బదులుగా అవమానాలను ఎదుర్కొన్నారన్న హస్తం పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ

ఢిల్లి : సీబీఎస్ఈ మూల్యాంకన ప్రక్రియలో అవకతవకలు జరిగాయని విద్యార్థులు ఆరోపిస్తున్న నేపథ్యంలో కేంద్రంపై కాంగ్రెస్ మండిపడింది. మోదీ ప్రభుత్వాన్ని సాధారణ ప్రశ్నలు అడిగిన విద్యార్థులు సమాధానాలకు బదులుగా అవమానాలను ఎదుర్కొన్నారని విమర్శించింది. విద్యార్థులు ధైర్యవంతులైన యువ భారతీయులని కొనియాడింది. మోదీ సర్కార్‌ను ప్రశ్నించిన విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు అర్హులని అభిప్రాయపడింది. వారు మంచి భవిష్యత్తును పొందేలా తాము చూస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు కొంతమంది విద్యార్థులతో తాను జరిపిన సంభాషణకు సంబంధించిన వీడియోను కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ తన సోషల్ మీడియా ఖాతాలలో పోస్ట్ చేశారు. గాంధీ ఈ వీడియో క్లిప్‌ను తన తోటి దేశద్రోహ సోరోస్ ఏజెంట్లతో జరిపిన అసలు విషయాలు బయటపెట్టే సంభాషణగా అభివర్ణించారు. మిగతా..2లో

ఎండలున్నాయ్ జాగ్రత్త
ఎక్కడికెళ్లినా నీళ్లు వెంట తీసుకెళ్లండి

- ❖ప్రధాని మోదీ 'మనసులో మాట' 134వ ఎపిసోడ్
- ❖ఇటీవల ఝార్ఖండ్‌లో అథ్లెటిక్స్ గురించి ప్రస్తావించిన మోదీ
- ❖మన్‌కీ బాత్‌లో గుర్వీందర్, అనిమేష్‌తో మాట్లాడిన ప్రధాని

ప్రజలకు మోదీ మరోసారి సూచనలు

ఢిల్లి : మన్‌కీ బాత్ 134వ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. ఎండల దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. బయటకు వెళ్లాల్సి వస్తే తాగునీరు వెంట ఉంచుకోవాలని మిగతా..2లో

నంద్యాలలో వైఎస్ఆర్ విగ్రహం ధ్వంసంపై షర్మిల ఆగ్రహం

- ★ఇది చంద్రబాబు రాజకీయ కక్ష సాధింపేనని ఆరోపణ
- ★పోలీసులు చూస్తూ ఉన్నా దాడిని ఆపలేదని విమర్శ
- ★విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయకపోతే ఆమరణ దీక్ష చేస్తానని హెచ్చరిక
- ★నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్

జూన్ 2 నుంచి రష్యాలో
నారా లోకేష్ పర్యటన...

- రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో మంత్రి లోకేష్ రష్యా పర్యటన
- జూన్ 2 నుంచి 7వ తేదీ వరకు రష్యాలో పర్యటించనున్న లోకేష్
- సెయింట్ పీటర్స్‌బర్గ్ అంతర్జాతీయ ఆర్థిక ఫోరంలో పాల్గొనాల్సిందిగా ఆహ్వానం
- పర్యటనలో భాగంగా పలువురు పారిశ్రామికవేత్తలతో భేటీ కానున్న మంత్రి

అమరావతి : రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ రష్యాలో పర్యటించనున్నారు. జూన్ 2 నుంచి 7వ తేదీ వరకు ఆయన రష్యాలో పర్యటించి, పలువురు పారిశ్రామికవేత్తలతో సమావేశం కానున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించి, వారిని ఏపీకి ఆహ్వానించడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం. రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరగనున్న ప్రతిష్ఠాత్మక 'సెయింట్ పీటర్స్‌బర్గ్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ ఫోరమ్' (SPIEF26) సదస్సులో పాల్గొనాల్సిందిగా మంత్రి లోకేష్‌కు ప్రత్యేక ఆహ్వానం అందింది. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల నుంచి పారిశ్రామికవేత్తలు, మిగతా..2లో

మెగా డీఎస్సీపై దుష్ప్రచారం చేస్తున్నారు..
జగన్‌పై మంత్రి సవిత ధ్వజం

- వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.
- నిరుద్యోగులకు చంద్రబాబు వస్తే జాబు... జగనొస్తే చావేనని విమర్శించారు.

అమరావతి, మే31 : వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు చంద్రబాబు వస్తే జాబు... జగనొస్తే చావేనని విమర్శించారు. (ఆదివారం) వెలగపూడిలోని సచివాలయంలో మీడియాతో మంత్రి సవిత మాట్లాడారు. మెగా డీఎస్సీలో అక్రమాలకు తావే లేదని స్పష్టం చేశారు. వైసీపీ నేతల బిడ్డలు సైతం డీఎస్సీలో క్వాలిఫై అయ్యి టీచర్లగా పనిచేస్తున్నారని ప్రస్తావించారు. ముఖ్యమంత్రిగా 2 లక్షలకు పైగా

మొదటి పేజి తరువాయి

జూన్ 2 నుంచి రష్యాలో నారా లోకేష్ పర్యటన...

ఆర్థిక నిపుణులు ఈ సదస్సుకు హాజరవుతారు. ఈ పర్యటనలో భాగంగా, లోకేష్ పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ముఖ్యంగా ఐటీ, విద్య, ఇతర కీలక రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఆయన చర్చలు జరపనున్నారు. ఈ పర్యటన ద్వారా రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

మెగా డీఎస్సీపై దుష్ప్రచారం చేస్తున్నారు..

జగన్‌పై మంత్రి సవిత ధ్వజం

టీచర్ పోస్టులు భర్తీ చేసిన ఘనత సీఎం చంద్రబాబుదని వ్యాఖ్యానించారు. జగన్ రెడ్డి ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు కూడా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. టీడీపీ మహానాడులో మహిళా రిజర్వేషన్ల ప్రకటనతో జగన్ మైండ్ బ్లాంక్ అయ్యిందని ఎద్దేవా చేశారు. మెగా డీఎస్సీలో అక్రమాలంటూ జగన్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మంత్రి సవిత ధ్వజమెత్తారు.

తెలంగాణలోని పలు జిల్లాలకు

వర్ష సూచన, ఈదురు గాలుల హెచ్చరిక!

వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. వర్షం కురిసే సమయంలో గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని అధికారులు హెచ్చరించారు. పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున చెట్ల కింద, విద్యుత్ స్తంభాల వద్ద ఆశ్రయం పొందవద్దని, ఉరుముల సమయంలో ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు. మరోవైపు, గత కొన్ని రోజులుగా తీవ్ర భానుడి భగభగలతో అల్లాడిపోతున్న రాష్ట్ర ప్రజలకు ఈ వర్షాలు పెద్ద ఉపశమనం కలిగించనున్నాయి. రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా 2 నుండి 4 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గుముఖం పడతాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ముఖ్యంగా హైదరాబాద్ మరియు దాని పరిసర ప్రాంతాలలో కూడా ఆకాశం సాధారణంగా మేఘావృతమై ఉంటుందని, సాయంత్రం లేదా రాత్రి సమయాల్లో చల్లటి గాలులతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని తెలిపారు. ఈ అకాల ఈదురు గాలుల వల్ల కోతకొచ్చిన పంటలు దెబ్బతినే ప్రమాదం ఉన్నందున, రైతులు తమ ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని వ్యవసాయ అధికారులు అప్రమత్తం చేశారు.

ఆ విషయం చిట్‌చాట్‌లో చెప్పడం కాదు...

అధికారికంగా ప్రకటించాలి: కవిత డిమాండ్

పార్టీ కార్యాలయంలో ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయానికి మీటర్లు బిగించేది లేదని కూడా ప్రభుత్వం స్పష్టంగా చెప్పాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలతో ముందుకెళుతున్నాయని ఆమె మండిపడ్డారు. రాష్ట్రంలో కొత్తగా రైతు డిస్కం ఏర్పాటు చేయడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని కవిత ఆరోపించారు. ఈ పేరుతో మిగిలిన రెండు డిస్కంలను ప్రైవేటుపరం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ కుట్రను అడ్డుకోవడానికి అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళతామని హెచ్చరించారు. అదేవిధంగా, కేంద్రం తీసుకొచ్చిన కొత్త సోలార్ జీవో కేవలం బడా కార్పొరేట్ సంస్థలకే మేలు చేస్తుందని ఆమె విమర్శించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును దసరా నాటికి ప్రతిపాదించకపోతే, తాను పాదయాత్ర చేపడతానని కవిత హెచ్చరించారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో 18 రోజుల పసికందు చేయి కోల్పోయిన ఘటనపై కవిత తీవ్రంగా స్పందించారు. ఇది చాలా దారుణమని, దీనికి ముఖ్యమంత్రి, జిల్లా మంత్రులే బాధ్యత వహించాలన్నారు. ఆ చిన్నారి పేరిట ప్రభుత్వం రూ.25 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే మా లక్ష్యం

తెలంగాణ మోడల్ స్కూళ్ల ఏర్పాటు, కొత్త ఉపాధ్యాయుల నియామకాలు, డిజిటల్ విద్యకు ప్రోత్సాహం, ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్, మౌలిక సదుపాయాల కల్పన, డ్రాపౌట్ల నియంత్రణ వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పుకొచ్చారు. పాఠశాల విద్యలో తెలంగాణ రాష్ట్ర పనితీరు గణనీయంగా మెరుగుపడిందని కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన 'ఫెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ 'లో పేర్కొనడం తమ ప్రభుత్వ రెండేళ్ల కృషికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. గత పదేళ్లలో విద్యారంగం ఎదుర్కొన్న సవాళ్లను అధిగమించి, విద్యా వికాస పునర్నిర్మాణానికి తమ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని సీఎం తెలిపారు. అయితే తాజా ఫలితాలతో సంతృప్తి చెందకుండా మరింత మెరుగైన ఫలితాల కోసం ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు పూర్తయిన తర్వాత తెలంగాణ విద్యా వ్యవస్థ దేశంలోనే అగ్రస్థానంలో నిలుస్తుందనే విశ్వాసం తమకు ఉందని చెప్పుకొచ్చారు. ఈ లక్ష్య సాధనకు కేంద్ర నివేదికలో వచ్చిన తాజా ఫలితాలు మరింత ప్రేరణనిచ్చాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

తోటి దేశద్రోహ సోరోస్ ఏజెంట్లతో

అసలు విషయాలు బయటపెట్టే సంభాషణ జరిపా

'స్టూడెంట్స్ అకస్మాత్తుగా దేశద్రోహులుగా మారిపోయారు'

"వేదాంత్, అతని స్నేహితులు తెలివైన, ధైర్యవంతులైన భారతీయ యువకులు. వారు సీబీఎస్ఈ, మోదీ ప్రభుత్వాన్ని సాధారణ ప్రశ్నలు అడిగారు. కానీ సమాధానాలకు బదులుగా అవమానాలను ఎదుర్కొన్నారు. ఆ స్టూడెంట్స్ ఉజ్వలమైన, సురక్షితమైన భవిష్యత్తుకు అర్హులు. ఆ భవిష్యత్తును పొందేలా మేము చూస్తాం. విద్యార్థులు తమ జవాబు పత్రాలను అడిగారు అంతే. దీంతో స్టూటెండ్స్ కాస్త అకస్మాత్తుగా దేశద్రోహులుగా మారిపోయారు. సమస్యను అంగీకరించడానికి ప్రభుత్వం నిరాకరిస్తోంది. అందుకు బదులుగా పేద విద్యార్థులను నిందిస్తోంది. డీప్ స్టేట్, గూఢాచారులు, ఉగ్రవాదులు అని ముద్ర వేస్తోంది." అని విద్యార్థులతో రాహుల్ గాంధీ పేర్కొన్నారు. మరోవైపు, సీబీఎస్ఈ వివాదంపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే స్పందించారు. మోదీ సర్కార్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆందోళనలు వ్యక్తం చేస్తున్న విద్యార్థుల మాట వినకుండా, వారిపై 'డీప్ స్టేట్ ఏజెంట్లు', 'పాకిస్తానీలు' అని ముద్ర వేస్తున్నారని మండిపడ్డారు. విద్యా రంగంలో ప్రభుత్వ వైఫల్యాల కారణంగా సీబీఎస్ఈ విద్యార్థులు, నీట్ అభ్యర్థులు ఇద్దరూ బాధితులుగా మారారని పేర్కొన్నారు. ఒకప్పుడు ప్రతిభను పెంపొందించడంలో కీలక పాత్ర పోషించిన ప్రభుత్వ విద్యా సంస్థలు, ఇప్పుడు బీజేపీ నేతృత్వంలోని సర్కార్ హయాంలో పతనాన్ని ఎదుర్కొంటున్నాయని అన్నారు. నిరసన తెలిపే, సమస్యలను లేవత్తిన యువత గొంతులను మోదీ ప్రభుత్వం అణచివేస్తోందని ఆరోపించారు. నిరాధారమైన ఆరోపణలతో యువతను లక్ష్యంగా చేసుకుంటున్నారని విమర్శించారు. దేశ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడంలో బీజేపీ విఫలమైందని, నియామక పరీక్షలను తప్పుగా నిర్వహిస్తోందని మండిపడ్డారు. ఈ వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఖర్గే ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.

గడ్చిరోలి పోరాటం.. అభివృద్ధి పేరుతో ఆదివాసీ హక్కులకు ముప్పు?

అభివృద్ధి అంటే ఏమిటి? పరిశ్రమలు, గనులు, కార్పొరేట్ పెట్టుబడుల విస్తరణేనా? లేక ప్రజల జీవన ప్రమాణాలు, ప్రకృతి సమతుల్యత, రాజ్యాంగబద్ధ హక్కుల పరి రక్షణతో కూడిన సమగ్ర పురోగతేనా? మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సూరజ్‌గఢ్ ప్రాంతంలో జరుగుతున్న ఇనుప ఖనిజ తవ్వకాల వివాదం ఈ ప్రశ్నలను మరోసారి దేశం ముందుంచింది.. ఒకవైపు పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి అవకాశాల పేరుతో భారీ మైనింగ్ ప్రాజెక్టులు ముందుకు సాగుతుండగా, మరోవైపు అడవులు, ఆదివాసీల జీవనాధారాలు, పర్యావరణం తీవ్ర ముప్పును ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో మహా రాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో లాయిడ్ మెటల్స్ కంపెనీ కోసం వేల ఎకరాల అడవులను నాశనం చేస్తున్నారనే ఆరోపణలు దేశవ్యాప్తంగా చర్చకు దారితీస్తున్నాయి. ఈ అంశాన్ని కేవలం 'అభివృద్ధి వ్యతిరేకత'గా చూడలేం. అలాగే కార్పొరేట్ ప్రయోజనాల కోసం అడవులు, ఆదివాసీ హక్కులను త్యాగం చేయడాన్ని 'జాతీయ అభివృద్ధి'గా చిత్రించలేం. దీనిని సమగ్ర రాజకీయ, ఆర్థిక, సామాజిక దృష్టితో పరిశీలించాలి.

అభివృద్ధి పేరుతో..

దేశం పారిశ్రామికంగా అభివృద్ధి చెందడం చారిత్రక అవసరం. పరిశ్రమలు లేకుండా ఉపాధి, సాంకేతిక పురోగతి సాధ్యం కాదు. అయితే ప్రశ్న ఏమిటంటే.. ఆ అభివృద్ధి ఎవరి కోసం? ఏ విధంగా? ఎవరి ఖర్చుపై? అభివృద్ధి పేరుతో స్థానిక ప్రజల జీవన హక్కులను ధ్వంసం చేయడం, రాజ్యాంగబద్ధ హక్కులను కాలరాయడం సమర్థించలేం. గడ్చిరోలిలో అడవి కేవలం ప్రకృతి సంపద కాదు. అది ఆదివాసీల జీవన విధానం, సంస్కృతి, ఆర్థిక ఆధారం. ఇలాంటి ప్రాంతాల్లో భారీ మైనింగ్ ప్రాజెక్టులు చేపట్టేటప్పుడు స్థానిక ప్రజల అభిప్రాయం, గ్రామసభల నిర్ణయాలు అత్యంత కీలకం కావాలి. రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్, పెసా చట్టం (గాజుగూా), అటవీ హక్కుల చట్టం (ఖీ=గూా) ఆదివాసీల భూమి, అటవీ హక్కులను రక్షించేందుకు ప్రత్యేకంగా రూపొందించబడ్డాయి. గ్రామసభ అనుమతి లేకుండా భూసేకరణ జరగకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ, అనేక సందర్భాల్లో ఈ చట్టాలను పక్కనబెట్టి కార్పొరేట్ కంపెనీలకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

ప్రజల జీవనాధారాలపై మూలధన దాడి!

ఖనిజ సంపద అధికంగా ఉన్న ప్రాంతాలన్నీ ప్రధానంగా ఆదివాసీ ప్రాంతాలే. వీటిని 'అభివృద్ధి జోన్లు'గా ప్రకటించి పెద్ద కంపెనీలకు అప్పగించడం ద్వారా స్థానికులపై ఆర్థిక, సామాజిక ఒత్తిడి పెరుగుతోంది. అయితే ప్రజాస్వామిక శక్తులు పరిశ్రమలను పూర్తిగా వ్యతిరేకించడం లేదు. కానీ 'ప్రజల కోసం అభివృద్ధా? కార్పొరేట్ లాభాల కోసం అభివృద్ధా?' అనే ప్రశ్నను లేవనెత్తుతున్నాయి. వాతావరణ మార్పుల సంక్షోభం పెరుగుతున్న తరుణంలో జీవ వైవిధ్యానికి నిలయమైన గడ్చిరోలి అడవులను రక్షించడం దేశ భవిష్యత్తుతో ముడిపడి ఉంది. ఒడిశాలో నియమగిరి వేదాంత ప్రాజెక్టు, ఛత్తీస్‌గఢ్‌లో హస్దేవ్ అరణ్యాల పరిరక్షణ ఉద్యమాల వలెనే గడ్చిరోలి సురజ్‌గఢ్ మైనింగ్ వ్యతిరేక పోరాటం కూడా ప్రస్తుత అభివృద్ధి నమూనాపై పెద్ద చర్చను లేవనెత్తింది. మార్క్సిజం ప్రకారం పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రకృతి, భూమి, అడవులు లాభాల కోసం వస్తువులుగా

లబ్ధిదారులకు గుడ్ న్యూస్.. త్వరలోనే చేతికి సొంతింటి తాళాలు..

మొదటి పేజి తరువాయి

అత్యంత కీలకమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.273.79 కోట్ల నిధులను విడుదల చేస్తూ పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ప్రభుత్వం తీసుకున్న ఈ తాజా నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వివిధ టిడ్కో హౌసింగ్ సముదాయాల్లో నిలిచిపోయిన పనులకు మోక్షం లభించనుంది. కేవలం ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయడమే కాకుండా, లబ్ధిదారులు అక్కడ నివసించడానికి అనుకూలంగా అన్ని రకాల మౌలిక వసతులను కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నిధుల విడుదలతో టిడ్కో గృహాల వద్ద మౌలిక వసతుల అభివృద్ధి పనులు వేగవంతం కానున్నాయి. ప్రధానంగా లబ్ధిదారుల కాలనీలలో రోడ్ల నిర్మాణం, అత్యాధునిక డ్రైనేజీ వ్యవస్థ, నిరంతర విద్యుత్ సరఫరా మరియు తాగునీటి వసతి కల్పన వంటి పనులకు ఈ నిధులను ఖర్చు చేయనున్నారు.

ఈ నిర్ణయం వల్ల కలిగే ముఖ్య ప్రయోజనాలు:

మౌలిక వసతుల అభివృద్ధి: కాలనీలలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ పనులు వేగంగా పూర్తవుతాయి. వేలాది మందికి ప్రయోజనం: ఇళ్ల కోసం ఎప్పటినుంచో నిరీక్షిస్తున్న వేలాది మంది లబ్ధిదారుల నిరీక్షణకు తెరపడనుంది. పంపిణీ ప్రక్రియకు ఊతం: మౌలిక వసతులు పూర్తికాగానే ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించే ప్రక్రియ మరింత సులభతరం అవుతుంది. చాలా కాలంగా ఇళ్ల నిర్మాణం పూర్తి కాక, మౌలిక వసతులు లేక ఇబ్బంది పడుతున్న వేలాది మంది లబ్ధిదారులకు ఈ నిర్ణయం వల్ల నేరుగా ప్రయోజనం చేకూరనుంది. నిధుల విడుదలతో ఇళ్ల పంపిణీ ప్రక్రియ మరింత వేగవంతం కానుంది. గృహాల నిర్మాణం చివరి దశకు చేరుకోవడంతో, అతి త్వరలోనే లబ్ధిదారులకు ఇళ్ల తాళాలను హ్యాండోవర్ చేసేందుకు అధికారులు కసరత్తులు ప్రారంభించారు. సొంత ఇంటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం వేసిన ఈ ముందడుగుపై లబ్ధిదారుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

బతికున్నంత కాలం బీఆర్ఎస్‌లోనే

మొదటి పేజి తరువాయి

రావు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జర్నలిస్టులతో నిర్వహించిన చిట్ చాట్‌లో హరీష్ రావు తాను బీఆర్ఎస్‌లోనే ఉంటానని కేసీఆర్‌పై ఒట్టేసి చెప్పాలని చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. మీడియా సమావేశంలో ఆయన రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ భావోద్వేగ భరితమైన కౌంటర్ ఇచ్చారు. తన పొలిటికల్ అస్తిత్వం, విధేయతపై వస్తున్న ఊహాగానాలకు గట్టి సమాధానమిచ్చారు. మళ్లీ మళ్లీ చెబుతున్నా.. నా జీవితం అంతా కేసీఆర్ తోనే ముడిపడి ఉంది అని హరీష్ రావు స్పష్టం చేశారు. తన రాజకీయ ప్రస్థానం కేసీఆర్ మార్గదర్శకత్వంలోనే సాగిందని, ఆయనపై తనకు ఉన్న గౌరవాన్ని ఎవరూ శంకించలేరని పేర్కొన్నారు. బతికున్నంత కాలం తాను బీఆర్ఎస్ పార్టీలోనే ఉంటానని, పార్టీ మారే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మైండ్ గేమ్ పాలిటిక్స్ ఆడుతూ ప్రతిపక్షంలో గందరగోళం సృష్టించాలని చూస్తున్నారని, కానీ తన విషయంలో ఆ పప్పులు ఉడకవని హరీష్ రావు ఎద్దేవా చేశారు. తెలంగాణ మలిదశ ఉద్యమ కాలం నుండి తాను గులాబీ జెండాను మోస్తున్నానని, ఈ ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులు చూశానని హరీష్ రావు గుర్తుచేశారు. నా పుట్టుక, చావు రెండూ బీఆర్ఎస్ పార్టీలోనే జరుగుతాయి అంటూ ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి లాగా తాను పార్టీలు మారే వ్యక్తిని కాదని, నిఖార్సైన ఉద్యమకారుడిగా పార్టీ అధినేత కేసీఆర్ వెంటే ఉంటానని స్పష్టం చేశారు. తనపై ఒట్లు పెట్టాలని కోరే హక్కు రేవంత్‌కు లేదని, ముందు సీఎం తన సొంత పార్టీ హామీలపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. రాష్ట్రంలో రైతాంగ సమస్యలు, ద్రవ్యోల్బణం, ఇతర పరిపాలనా లోపాలను కప్పిపుచ్చుకోవడానికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటువంటి వ్యక్తిగత సవాళ్లను తెరపైకి తెస్తున్నారని హరీష్ రావు మండిపడ్డారు. రైతుల మోటర్లకు మీటర్లు పెట్టే అంశంపై అధికారికంగా స్పందించకుండా, ఇలాంటి పొలిటికల్ డ్రామాలను రక్తికట్టించాలని చూడటం రేవంత్ రెడ్డి నైజమని

విమర్శించారు. ఇప్పటికైనా డైవర్షన్ పాలిటిక్స్ బంద్ చేసి, ఇచ్చిన హామీల అమలుపై ప్రెస్ మీట్ పెట్టాలని, తన రాజకీయ భవిష్యత్తు గురించి రేవంత్ రెడ్డి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హరీష్ రావు సలహా ఇచ్చారు.

నంద్యాలలో వైఎస్ఆర్ విగ్రహం ధ్వంసంపై షర్మిల ఆగ్రహం

మొదటి పేజి తరువాయి

అమరావతి :నంద్యాల జిల్లాలో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేయడంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా స్పందించారు. విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయకపోతే ఆమరణ దీక్షకు దిగుతానని కూటమి ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి చంద్రబాబును ఆమె హెచ్చరించారు. ఈ ఘటనను కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. నంద్యాలలోని శ్రీనివాస సెంటర్‌లో వైఎస్ఆర్ విగ్రహంపై ఓ వ్యక్తి దాడి చేసి ధ్వంసం చేశాడని షర్మిల తెలిపారు. పట్టపగలు ఈ ఘటన జరుగుతుంటే, అక్కడే ఉన్న పోలీసులు నిలువరించకపోవడం హేయమైన చర్య అని ఆమె

విమర్శించారు. దాడి చేసిన వ్యక్తికి మానసిక స్థితి బాగోలేదని చెప్పి పోలీసులు చేతులు దులుపుకోవడం సరికాదని అన్నారు. ఇది చంద్రబాబు రాజకీయ కక్ష సాధింపు ఉందని షర్మిల ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఇలాంటి ఘటనలను చూస్తూ చోద్యం చూడటం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో వైఎస్ఆర్ విగ్రహాలపై జరుగుతున్న దాడులను అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితుడితో పాటు, అతని వెనుక ఉన్న శక్తులెవరో తేల్చి కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. పాత విగ్రహం స్థానంలో వెంటనే కొత్తది ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో నంద్యాలలో అదే సెంటర్‌లో తాను ఆమరణ దీక్షకు దిగుతానని ముఖ్యమంత్రిని హెచ్చరించారు.

విశాఖ ఎయిర్ పోర్టు కూడా ఉండాల్సిందే

మొదటి పేజి తరువాయి

అమరావతి : విశాఖపట్నం విమానాశ్రయం భవిష్యత్తుపై ప్రస్తుతం రాష్ట్రంలో ఒక ఆసక్తికరమైన రాజకీయ, సామాజిక చర్చ నడుస్తోంది. విజయనగరం జిల్లా పరిధిలో కొత్తగా నిర్మిస్తున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే, ప్రస్తుతం ఉన్న విశాఖ ఎయిర్‌పోర్టును పూర్తిగా మూసివేస్తారనే ప్రచారంపై బీజేపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్ రాజు తీవ్రంగా స్పందించారు. విశాఖ ఎయిర్‌పోర్ట్‌ను పక్కనపెట్టి కేవలం భోగాపురంపైనే ఆధారపడతామనడం సరైన నిర్ణయం కాదన్న ఆయన.. 62 ఏళ్లుగా కలిసి కాపురం చేసిన భార్యాభర్తలు ఇప్పుడు విడాకులు తీసుకుంటామంటే ఎంత విడ్డూరంగా ఉంటుందో.. విశాఖకు ఉన్న ఎయిర్‌పోర్ట్‌ను తీసేసి భోగాపురం మాత్రమే ఉంటుంది చెప్పడం కూడా అలాంటిదే అంటూ తనదైన శైలిలో ఘాటు వ్యాఖ్యలు చేశారు. గూగుల్, టీసీఎస్ వంటి దిగ్గజ అంతర్జాతీయ ఐటీ సంస్థలు అడుగుపెడుతున్న విశాఖ నగరానికి సొంతంగా సిటీ పరిధిలో ఎయిర్‌పోర్ట్ లేకపోవడం సిగ్గుచేటని విష్ణుకుమార్ రాజు అంటున్నారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వచ్చినా, విశాఖపట్నం ఎయిర్‌పోర్టును కూడా సమాంతరంగా కొనసాగించాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు.

భోగాపురం వెళ్లడానికి అయ్యే ప్రయాణ ఖర్చులు, పెట్రోల్, డీజిల్ భారం సామాన్య, మధ్యతరగతి ప్రయాణికులకు గుండెల్లో రాయిలా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖ నుంచి భోగాపురం వెళ్లడం కంటే వందే భారత్ రైలు ఎక్కి విజయవాడ వెళ్లడమే సులువనే పరిస్థితి రాకూడదంటే.. కనెక్టివిటీ రోడ్లు పూర్తికావడంతో పాటు విశాఖ ఎయిర్‌పోర్ట్ మూసివేత ఆలోచనపై తక్షణమే ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని ఆయన కూటమి ప్రభుత్వానికి సూచించారు. నిజానికి, ఇప్పుడు విశాఖపట్నం-భోగాపురం విషయంలో జరుగుతున్న చర్చ.. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాద్‌లో జరిగిన బేగంపేట వర్సెస్ శంషాబాద్ వివాదాన్ని గుర్తుచేస్తోంది. ఆనాడు శంషాబాద్‌లో రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించినప్పుడు కూడా నగరవాసులు, పారిశ్రామికవేత్తలు ఇలాగే డిబేట్లు నడిపారు. నగరం నడిబొడ్డున ఉన్న బేగంపేట ఎయిర్‌పోర్టును పూర్తిగా మూసివేయకుండా, కనీసం డొమెస్టిక్ సర్వీసులు కైనా అనుమతించాలని పెద్ద ఎత్తున డిమాండ్లు వచ్చాయి. కానీ, నాడు కుదిరిన అంతర్జాతీయ ఒప్పందాలు, నూతన ఎయిర్‌పోర్ట్ నిబంధనల ప్రకారం బేగంపేటలో కమర్షియల్ విమాన రాకపోకలను పూర్తిగా నిలిపివేయాల్సి వచ్చింది. నేడు అది కేవలం రక్షణ శాఖ, వీఐపీ ఛాపర్లకే పరిమితమైంది. ప్రస్తుతం ఉన్న విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్ కూడా బేగంపేట తరహాలోనే ప్రాథమికంగా భారత రక్షణ శాఖ ఆధీనంలో ఉంది. ఇక్కడ కేవలం సివిల్ ఎన్‌క్లేవ్ ద్వారానే ప్రయాణికుల విమానాలను నడుపుతున్నారు. దేశంలోని నోయిడా వంటి అనేక పెద్ద నగరాల్లో ఒకటి కంటే ఎక్కువ విమానాశ్రయాలు విజయవంతంగా నడుస్తున్నప్పుడు, వైజాగ్ లాంటి మెట్రో సిటీలో కూడా రెండు ఎయిర్‌పోర్టులను ఎందుకు కొనసాగించకూడదని విష్ణుకుమార్ రాజు ప్రశ్నిస్తున్నారు. భోగాపురం నిర్వహణ సంస్థ అయిన జీఎంఆర్ .. విశాఖ ఎయిర్‌పోర్ట్ నుంచి కూడా కొన్ని సర్వీసులు నడిపి యూజర్ ఛార్జీలు వసూలు చేసుకునేలా వెసులుబాటు కల్పించాలని ఆయన కోరుతున్నారు.

ఎండలున్నాయ్ జాగ్రత్త- ఎక్కడికెళ్లినా నీళ్లు వెంట తీసుకెళ్లండి

మొదటి పేజి తరువాయి

మరోసారి సూచించారు. వివిధ రాష్ట్రాల్లో ఎండల నుంచి ఉపశమనం కోసం తాగే పానీయాల గురించి ప్రధాని ప్రస్తావించారు. మజ్జిగ, షర్బత్, తదితర పానీయాలను తాగాలని ప్రజలకు సూచించారు. ఆ తర్వాత కేరళ ఆలువా ప్రాంతంలో స్విమ్మింగ్ క్లబ్ సేవలను మోదీ ప్రశంసించారు. 15 వేల మంది ఔత్సాహికులకు క్లబ్ నిర్వహకులు ఉచితంగా ఈత నేర్పించారని తెలిపారు. ఇటీవల ఝార్ఖండ్‌లో అథ్లెటిక్స్ గురించి ప్రస్తావించిన మోదీ నాలుగు విభాగాల్లో క్రీడాకారులు రికార్డులు సృష్టించారని అన్నారు. వంద మీటర్ల పరుగులో గుర్విందర్, అనిమేష్ రికార్డులు సృష్టించారని వెల్లడించారు. ఈ సందర్భంగా గుర్విదర్, అనిమేష్ పరుగు పందెంలో తమ అనుభవాలను ప్రధాని మోదీతో పంచుకున్నారు. అలాగే, పురాణ కాలం నాటి అపూర్వ సంపద గురించి మోదీ ప్రస్తావించారు. ఈ సందర్భంగా చోళుల కాలం నాటి తామర పత్రాల విశిష్టత, ఛత్తీస్‌గఢ్‌లో లభించిన పాండవుల కాలం నాటి తామరపత్రాల గురించి వివరించారు. "కొద్ది రోజుల క్రితం నెదర్లాండ్స్‌ను సందర్శించే అవకాశం నాకు లభించింది. అక్కడ నేను అనేక సమావేశాల్లో పాల్గొన్నాను. అయితే, అక్కడ జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో చోళుల కాలం నాటి పురాతన రాగి ఫలకాలను భారత్‌కు అప్పగించారు. అంతేకాదు, ఆ కార్యక్రమానికి నెదర్లాండ్స్ ప్రధాని కూడా హాజరయ్యారు. ఈ ఫలకాల గురించి దేశం నలుమూలలు, విదేశాల నుంచి నాకు నిరంతరం సందేశాలు వస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళ సమాజాల్లో కూడా ఒక ప్రత్యేకమైన ఉత్సాహం నెలకొని ఉంది. వీటిలో 21 పెద్ద, 3 చిన్న రాగి ఫలకాలు ఉన్నాయి. అవి ప్రధానంగా మొదటి రాజేంద్ర చోళ మహారాజుకు సంబంధించినవి. ఆనైమంగళం గ్రామాన్ని బౌద్ధ విహారానికి ఇచ్చినట్లు ఇందులో పేర్కొన్నారు. అవి చోళ రాజవంశం విజయాలను వివరిస్తాయి. ఆ రాజవంశం బలమైన సముద్ర శక్తిని చూపిస్తాయి. ఆగ్నేయాసియా దేశాలతో వారి సంబంధాల గురించి కూడా సమాచారాన్ని అందిస్తాయి. చోళ సామ్రాజ్యం గొప్ప చరిత్ర, సంస్కృతి మనందరికి గర్వకారణం. అటువంటి అమూల్యమైన వారసత్వ సంపదను పరిరక్షించడానికి మా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది."

-నరేంద్ర మోదీ, భారత ప్రధాని

ఖగోళ శాస్త్రం తరతరాలుగా భారతీయులను ఆకర్షించిందని, గ్రామీణ ప్రాంతాల్లో ఈ విషయాన్ని ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి బెంగళూరు ఖగోళ సొసైటీ ఒక కార్యక్రమాన్ని ప్రారంభించిందని మోదీ నొక్కి చెప్పారు. అలాగే, రాత్రిపూట నక్షత్రాలను చూడటం అనేది ఒక అద్భుతమైన అనుభవమని, ఆస్ట్రో కేరళ అనే సంస్థ రాత్రిపూట పరిశీలన శిబిరాలు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తుందని ఆయన చెప్పారు. అక్కడి యువత టెలిస్కోపులు తయారు చేయడం, నక్షత్ర పటాలను ఉపయోగించడం నేర్చుకుంటున్నారని అన్నారు. "రాజ్‌కోట్‌లోని బిగ్ బ్యాంగ్ ఆస్ట్రానమీ క్లబ్ గిర్ అడవుల నుంచి రాన్ ఆఫ్ కచ్ వరకు అనేక ఖగోళ శాస్త్ర కార్యక్రమాలను నిర్వహించింది" అని మోదీ అన్నారు.

మన్ కీ బాత్ స్ఫూర్తితో సైనికులకు విరాళం

మరోవైపు, తమిళనాడులోని నాగర్‌కోయిల్‌కు చెందిన విద్యావేత్త గిరిజా అమ్మ గురించి మోదీ మాట్లాడారు. ఆమె చెన్నైలోని జైగోపాల్ గరోడియా హిందూ విద్యాలయంతో సహా 15 పాఠశాలలను నడుపుతున్నారని చెప్పారు. ఆమె దేశభక్తి స్ఫూర్తి ప్రతి భారతీయుడికి ఉత్తేజం ఇస్తుందన్నారు. "మన్ కీ బాత్ స్ఫూర్తితో, ఆమె దేశంలోని అనేక మంది సైనికులకు విరాళం ఇవ్వడానికి ప్రతిజ్ఞ చేశారు. ఇది చేయడానికి, ఆమె తన పాఠశాలలన్నింటిలోని విద్యార్థులను ప్రేరేపించారు. ధైర్యవంతులైన సైనికుల కోసం ప్రతిరోజూ ఒక రూపాయి విరాళంగా ఇవ్వమని ఆమె పిల్లలను కోరారు. అంటే, ప్రతి విద్యార్థి ఒక సంవత్సరంలో 365 రూపాయలు సేకరించారు. ఈ చిన్న విరాళాల ద్వారా సుమారు 40 లక్షల రూపాయలు సేకరించారు" అని మోదీ పేర్కొన్నారు. చెన్నైలోని మొట్టమొదటి హిందూ పాఠశాల గత సంవత్సరం తన 50వ వార్షికోత్సవాన్ని జరుపుకుందని మోదీ పేర్కొన్నారు. "దేశ విద్య, సాంస్కృతిక గౌరవాన్ని పెంపొందించడంలో ఈ పాఠశాలల పోషిస్తున్న పాత్ర ప్రశంసనీయం. ఇందులో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరినీ నేను అభినందిస్తున్నాను. ముఖ్యంగా మన ధైర్యవంతులైన సైనికులకు విరాళాలు అందించిన విద్యార్థులను ప్రశంసిస్తున్నాను. భారతదేశంలోని ప్రతి గ్రామంలో, నగరంలో మనకు స్ఫూర్తినిచ్చే ఏదో ఒక సంఘటన జరుగుతూనే ఉంది" అని మోదీ పేర్కొన్నారు.

కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి పట్టు కొమ్మలు

బూతు కమిటీలు, గ్రామ కమిటీలు, మండల అధ్యక్షులకు కీలక బాధ్యత

గ్రామ స్థాయిలో గ్రామ అధ్యక్షులదే మొదటి పాత్ర .

జిల్లా అధ్యక్షుడు శివసేన రెడ్డి.

వనపర్తి బ్యూరో మే 31 (వార్త నిర్భయం) సంస్థాగతంగా బలోపేతం కావడానికి, నాయకత్వ సామర్థ్యాలు పెంచడానికి, బూతు స్థాయి నుంచే పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లడమే జిల్లా మండల కమిటీల లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శివసేన రెడ్డి అన్నారు.

ఆదివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యనిర్వాహక సమీక్ష కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి స్థానిక శాసనసభ్యుడు మేఘా రెడ్డితో కలిసి శివసేన రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శివసేన రెడ్డి మాట్లాడుతూ పార్టీ పటిష్టత కోసం అందరం ఐక్యంగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. గతంలో ఉన్న మండల కమిటీలకు, ఇప్పుడు కొత్తగా ఎన్నుకున్న మండల కమిటీలకు చాలా తేడా ఉంటుందని కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు. గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందాలని, అందుకోసం సంస్థాగతంగా గ్రామ కమిటీలు, బూతు కమిటీలు కీలకంగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. పార్టీకి నిబద్ధతతో పనిచేసే వారికే మొదటి ప్రాధాన్యత ఉంటుందని, కొత్తగా ఎన్నుకున్న మండల అధ్యక్షులు, కార్యవర్గం బాధ్యతగా పనిచేయాలని చెప్పారు. అంతకు ముందు

కొత్తగా నియమించిన పట్టణ, మండల కమిటీ సభ్యులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, కొత్తగా ఎన్నికైన పట్టణ, మండల అధ్యక్షులు పలువురు పాల్గొన్నారు.

సెంటినరీ బాప్టిస్ట్ చర్చి లో మేగా సౌండ్ సిస్టమ్ ప్రారంభం..

మంత్రి కొండా సురేఖ. కొండా మురళిధర్ రావు పాల్గొన్నారు.

వరంగల్ ప్రతినిధి మే 31 (వార్త నిర్భయం) క్రిస్టియన్ కాలనీలోని సెంటెనరీ బాప్టిస్ట్ చర్చ్ లో నూతన ఆడియో సిస్టమ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తన భర్త, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు తో కలిసి నూతన ఆడియో సిస్టమ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన మంత్రి కి క్రిస్టియన్ మత పెద్దలు, అభిమానులు సాదర స్వాగతం పలికారు కొండా మురళీధర్ రావు, సురేఖ దంపతులను ఈ సందర్భంగా క్రిస్టియన్ మతపెద్దలు సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చర్చ్ ని అద్భుతంగా తీర్చిదిద్దారని ప్రశంసించారు. ఏసుప్రభువు కృపతో చర్చ్ అభివృద్ధిలో పాలుపంచుకునే భాగ్యం తనకు దక్కిందని మంత్రి సురేఖ అన్నారు. సన్మార్గంలో పయనించి జీవితానికి సరైన అర్థాన్ని ఆపాదించుకోవాలని ఈ సందర్భంగా మంత్రి సురేఖ పిలుపునిచ్చారు. క్రిస్టియన్ మైనారిటీల సర్వతో ముఖాభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తున్నదని మంత్రి తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా చర్చిల నిర్మాణానికి మౌలిక వసతుల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. క్రైస్తవుల సంక్షేమం కోసం తన వంతు పూర్తి సహకారం ఉంటుందని ఏ ఆపద వచ్చిన అండగా ఉంటామని ఈ సందర్భంగా తెలిపారు.

మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం





వరంగల్. ప్రతినిధి మే 31(వార్త నిర్భయం) మున్నూరు కాపులు ఐక్యంగా, సంఘటితంగా ముందుకు సాగి బహుజన వర్గాలను కలుపుకొని రాజ్యాధికార సాధన దిశగా కృషి చేయాలని మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం పిలుపునిచ్చింది. మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తమరావు పటేల్ అధ్యక్షతన, వరంగల్ మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్. పటేల్ ఆధ్వర్యంలో వరంగల్‌లోనీ ఆకుతోట కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పలు కీలక తీర్మానాలు ఆమోదించారు. సమావేశంలో మున్నూరు కాపు సమాజ ఐక్యత, సంఘ బలోపేతం, రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీలను మరింత సమన్వయంతో ముందుకు తీసుకెళ్లడం, సమాజ హక్కుల సాధన కోసం కార్యాచరణ రూపొందించడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. అలాగే రాష్ట్రంలో మున్నూరు కాపులకు తగిన రాజకీయ, సామాజిక ప్రాతినిధ్యం కల్పించాలని సమావేశం కోరింది. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తమరావు పటేల్‌ను నన్నపునేని నరేందర్ పటేల్ మరియు సభ్యులు ఘనంగా సన్మానించారు. సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు నన్నపునేని నరేందర్ పటేల్‌ను రాష్ట్ర కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు. అదే విధంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ జిల్లాల జిల్లా అధ్యక్షులను కూడా శాలువాలు, జ్ఞాపికలతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, కార్యవర్గ సభ్యులు, యువజన నాయకులు మరియు మున్నూరు కాపు సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను నిజాయితీగా గుర్తించండి.

కమిటీ కాలయాపన చేస్తే చూస్తూ ఊరుకోము.

నందగిరి రజినీకాంత్ డిమాండ్

ఉద్యమకారులకు జార్ఖండ్ తరహా పెన్షన్, ఉచిత ప్రయాణ సౌకర్యం కావాలి

హైదరాబాద్ మే 31 (వార్త నిర్భయం) హైదరాబాదు

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉద్యమకారుల కమిటీ నిజమైన ఉద్యమకారులను గుర్తించాలని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు నందగిరి రజినీకాంత్ అడ్వకేట్ డిమాండ్ చేశారు. కమిటీ కాలయాపన చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. హైదరాబాదులోని బషీర్బాగ్ పత్రికా సమావేశ మందిరంలో ఉద్యమకారుల సదస్సులో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారుల కోసం ఏర్పాటు చేసిన కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు నందగిరి రజినీకాంత్ మాట్లాడుతూ 1969 ఉద్యమకారులను, అమరవీరుల కుటుంబాలను, కేసుల పాలైన కుటుంబాలను, బాధలు పడిన కుటుంబాలను ఆదుకోవాలని కమిటీ సభ్యులు మాజీ శాసనమండలి సభ్యుడు రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డిలకు సూచించారు. కమిటీ నిజమైన ఉద్యమకారులను గుర్తించాలని డిమాండ్ చేశారు. కమిటీ కాలయాపన చేయకుండా ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. జార్ఖండ్ రాష్ట్రం తరహాలో నెలకు 25 వేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని, ఉచిత రైలు, బస్సు ప్రయాణ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కానాపురం మండల అధ్యక్షుడు వీరమల్ల రాములు, ఉమ్మడి

వరంగల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు, రాష్ట్ర మహిళా కార్యదర్శి కందికట్ల జయ, బొమ్మెర భాగ్యలక్ష్మి, వరంగల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు వంటలు మల్లక్క, వరంగల్ జిల్లా అధ్యక్షుడు చల్లా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నూతన బోర్ వెల్ బండ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే

వనపర్తి బ్యూరో మే 31 (వార్త నిర్భయం)

వనపర్తి మండలం చిట్యాల గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు రఘుపతిరావు నూతనంగా కొనుగోలు చేసిన బోర్వెల్స్ బండ్లను ఆదివారం వనపర్తి శాసనసభ్య తూడి మేఘారెడ్డి ప్రారంభించారు గోపాల్పేట మండలం బుద్ధారం గండి ఆంజనేయ స్వామి ఆలయంలో వాహనాలకు ప్రత్యేకంగా పూజ చేశారు ప్రారంభించేందుకు ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యే చే ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యే గారికి వేద ఆశీర్వాదాలు అందించారు అనంతరం ఎమ్మెల్యే వాహనాలు నడిపి ప్రారంభించారు స్వయంకృషితో పని చేసుకునే వారు ఎవరైనా జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకుంటారని చిట్యాల రఘుపతిరావు గారు సైతం ఆర్థికపురోభివృద్ధి సాధించాలని కోరారు అనంతరం ఆలయంలో కాసేపు మండల నాయకులతో ఆయన అంశాలను అడిగి తెలుసుకున్నారు కార్యక్రమంలో గోపాల్పేట మండల మార్కెట్ యార్డు ఉపాధ్యక్షులు సత్యశ్రీలా రెడ్డి, వనపర్తి మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, కాంగ్రెస్ నాయకులు కొంకి వెంకటేష్, కొంకి రమేష్, శివన్న, రమేష్, పెంటరావు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం.

చిన్నంబావి మే 31, వార్త నిర్భయం. తల్లితండ్రులను కోల్పోయి అనాధక పేదరికానికి చెందిన చాకలి నాగరాజు కుటుంబానికి 5000 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని గ్రామానికి చెందిన బూజల (జీపు)వెంకట్ రెడ్డి అందజేశారు. చిన్నంబావి మండల పరిధిలోని వెలుగొండ గ్రామానికి చెందిన మృతుడు చాకలి చిన్న నారాయణ(58) అనారోగ్యంతో గత పది రోజుల క్రితం మరణించటం జరిగింది. చిన్న నారాయణ మృతుని భార్య గత పది సంవత్సరాల కిందట చనిపోవడంతో కుటుంబం భారంతో గ్రామంలో పని దొరకక కూలి పని చేసుకోవడానికి చిన్న నారాయణ అతని కుమారుడు హైదరాబాదు వలస వెళ్లడం జరిగింది. అక్కడ నారాయణ కూడా చనిపోవడం జరిగింది. అతడు తండ్రి నీ కోల్పోవడంతో అనాధగా మిగిలిపోవడం జరిగింది .అతనికి ఎవరు ఆసర లేక పోవడంతో మానవత్వ తోటివారికి సహాయం చేయాలనే ఉద్దేశం తో వెంకట్ రెడ్డి ఉదర స్వభావం తో పేదవాడి కి అండగా నిలిచాడు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ భర్త చాకలి ఈశ్వరయ్య బూజల మోహన్ రెడ్డి మృతుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల జీతాల్లో కోతలు సరికాదు

హెల్త్ కార్డు నిబంధనలు చెప్పకుండా ప్రీమియం వసూళ్లు దారుణం

కార్డులు ఇచ్చిన

తర్వాత, నిబంధనలు విడుదల చేసిన తర్వాతే డబ్బు కోత పెట్టాలి

ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వరప్రసాద్ గౌడ్

వనపర్తి బ్యూరో, మే 31 (వార్త నిర్భయం) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల హెల్త్ కార్డుల పేరుతో నిబంధనలు ప్రకటించకుండా, ఆసుపత్రులతో సమావేశం పెట్టకుండా, ఉపాధ్యాయ సంఘాలకు హెల్త్ కార్డు నిబంధనలు చెప్పకుండా ప్రీమియం వసూలు చేయడం మోసమని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వరప్రసాద్ గౌడ్ ఆరోపించారు. ఉపాధ్యాయులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, అధికారికంగా కార్డులు జారీ చేయకుండా, హెల్త్ కార్డు నిబంధనలు విడుదల చేయకుండా జీతాల నుంచి హెల్త్ కార్డు ప్రీమియం పేరుతో కోత విధించడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల నుంచి వసూలు చేసిన ప్రీమియం డబ్బును వెనక్కి పంపాలని డిమాండ్ చేశారు. అధికారికంగా కార్డులు జారీ చేసిన తర్వాత, నిబంధనలు విడుదల చేసిన తర్వాతనే జీతాల నుంచి కోత పెడితే సరైన విధంగా ఉంటుందని సూచించారు. ప్రభుత్వం ఈ పథకం ఇష్టం లేని వారికి పథకం నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. భార్య భర్తలు ఇద్దరూ ఉద్యోగులైతే ఒకరి నుంచి మాత్రమే ప్రీమియం వసూలు చేయాలన్నారు. యువతి యువకులకు హెల్త్ కార్డు వర్తించేలా 25 నుంచి 35 సంవత్సరాల వయోపరిమితి పెంచాలని కోరారు. సీనియర్, జూనియర్ తేడా లేకుండా అందరు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఒకే రకమైన ప్రీమియం వర్తింపజేసే విధానం ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మనోహర్, జిల్లా ఉపాధ్యక్షుడు రాములు, మోహన్ గౌడ్, జిల్లా టెక్నికల్ ఇన్చార్జ్ మల్లేష్, రవికుమార్, శ్రీనివాస్ రెడ్డి, బాల గౌడ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

"మన్ కీ" "బాత్" కార్యక్రమాన్ని వీక్షించిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు

గోకవరం మే 31 (వార్త నిర్భయం)

మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ గారు రేడియో ద్వారా ప్రసంగించే "మాన్ కీ బాత్" కార్యక్రమాన్ని విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ -1 కంబాల శ్రీనివాసరావు ఆదేశాల మేరకుఆదివారం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గోకవరం తంటికొండ రోడ్డులోని సీఎండీ కార్యాలయం వద్ద టీవీలో ప్రత్యక్షంగా వీక్షించారు. ప్రతి నెల చివరి ఆదివారం సీఎండీ లే అవుట్ లో యధావిధిగా మన్ కి బాత్ కార్యక్రమాన్ని వీక్షించడం జరుగుతుంది నరేంద్ర మోడీ 134 ఎపిసోడ్ ను కంబాల శ్రీనివాసరావు పిలుపు మేరకు మండలంలోని ప్రతి బూత్ లో మాన్ కీ బాత్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

గబ్బిలాల పేటలో ప్రభుత్వ పాఠశాలకు స్థలాన్ని కేటాయించి తక్షణమే కట్టించాలి

-అఖిల పక్ష కమిటీ జేఏసీ

ఆధ్వర్యంలో సంతకాల సేకరణ..

హైదరాబాద్ బ్యూరో, మే 31 (వార్త నిర్భయం) మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కీసర సర్కిల్,జవహర్ నగర్ జీ హెచ్ ఎంసీ జన ప్రజావాణి జవహర్ నగర్ జీ హెచ్ ఎంసీ పరిధి గబ్బిలాలపేట ప్రభుత్వ పాఠశాల సాధన (జేఏసీ) కమిటీ సభ్యులు ఒక్కో కాలనీకి ఐదుగురు చొప్పున గబ్బిలాల పేట,ఓల్డ్ గబ్బిలాల్ పేట,సేవాలాల్ తండా,నందమూరి నగర్,వైఎస్ ఆర్ నగర్,రాజీవ్ ఇందిరా నగర్,జయశంకర్ నగర్,కెసిఆర్ నగర్,శాంతినగర్,గిరి ప్రసాద్ నగర్ లలో ఇల్లిల్లు తిరిగి సంతకాల సేకరణ కార్య క్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమాన్ని రేపు ఎల్లుండి వరకు నిర్వహించి మున్సిపాలిటీ కార్యాలయం ముందు ధర్నాచేసి వినతిపత్రం సమర్పిస్తామన్నారు. అనంతరం జిల్లాకలెక్టర్ కార్యాలయం ముందు పెద్దఎత్తున ఆందోళన చేస్తామని,పై డిమాండ్ ను సాధించే వరకు పోరాటాన్ని కొన సాగిస్తామని తెలిపారు.ఈ సందర్భంగా జేఏసీ నేతలు మాట్లాడుతూ ఆర్టికల్ రెండు(ఏ) ప్రకారం అందరికి విద్యను అందించటంలో భారత పాలకులు పట్టుదలతో లేరని,మానవ వనరును ఉత్పత్తి చేసేందుకు ఉపయోగపడే ఏకైక సాధనం విద్య అని ప్రపంచ దేశాలు గుర్తించి ఆవైపున పయనిస్తుంటే పెద్ద ప్రజాస్వామ్య దేశం అని చెప్పుకునే భారత పాలకులు మాత్రం వందలాది మంది పేద విద్యార్థులు ఉన్న గబ్బిలాలపేటలో ప్రభుత్వ పాఠశాలకు స్థలాన్ని కేటాయించి,ఏర్పాటు చేయక పోవటమే నిదర్శనం అని అన్నారు. పాఠశాలను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో శంకర్,దర్శణం యాదగిరి,సిపిఐ,నర్సింహ మాజీ సర్పంచ్,గడ్డం సదానందం సిపిఐ ఎంఎల్ మాస్ లైన్,శివప్రసాద్ న్యూడెమోక్రసీ,వి.ప్రవీణ్ టియుసిఐ,క్రిష్ణ ఐఎఫ్ టియు,ఎల్లయ్య ఎఐటియుసి,శివన్నారాయణ సిఐటియు,కాలేషా ముస్లీం వెల్ఫేర్ అసోసియేషన్,రాదే శ్యాం,ఆర్ సుధాకర్,కే.సత్యం సాగర్,శ్రీదేవి,అల్లూరి సావిత్రి చైతన్య మహిళా సంఘం,వి.జయసుధ,బి.లక్ష్మీబాయిపిఓడబ్ల్యు,తదితరులతో పాటు కాలనీల వాసులు పాల్గొన్నారు.

ఆదివారం రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు

శ్రీ బత్తుల బలరామకృష్ణ గారు గోదావరి నదీ కాలుష్యంపై ప్రెస్ మీట్ నిర్వహించారు..

ఈ ప్రెస్ మీట్లో ముఖ్యంగా

రాజనగరం మే 31 (ప్రజా ప్రతిభ)

ఉపముఖ్యమంత్రి శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ గారి రాజమహేంద్రవరం రెండు రోజుల పర్యటన అధికారులకు , శాసనసభ్యులకు, కూటమి నాయకులకు , స్థానిక ప్రజలకు ఎంతో స్ఫూర్తిని , సంతోషాన్ని కలుగజేసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నందుకు ఉపముఖ్యమంత్రి శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ గారికి రాజానగరం నియోజకవర్గం ప్రజలందరి తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. 2027 గోదావరి పుష్కరాలు సంపూర్ణ కాలుష్య రహితంగా, ప్లాస్టిక్ రహితంగా, అత్యంత ఆధ్యాత్మిక శోభతో నిర్వహించాలని ఉపముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైనది. మరియు భావితరాల భవిష్యత్తుకు కాలుష్య రహిత సమాజాన్ని అందించే భాధ్యత తీసుకున్నందుకు వారికి ప్రత్యేకమైనటువంటి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఉపముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు గోదావరిని సందర్శించినపుడు అందులో కలుస్తున్నటువంటి వ్యర్థాలు, ప్లాస్టిక్, మురికినీరు , పరిశ్రమల కాలుష్యం వాటి వల్ల గోదావరిని వేదిస్తున్నటువంటి కాలుష్య తీవ్రతను చూసినప్పుడు గోదావరి అమ్మ ఒకప్పుడు ఎంతో పవిత్రంగా ఉండేది. త్రాగునీరు సేవించిన వారు నిండు నూరేళ్ళు ఆరోగ్యంగా జీవించేవారు. జలజీవరాశులు, మత్స్య సంపద పెరుగుతూ వచ్చేది. సాగునీరుతో పంటపొలాలు సారవంతం అయ్యేవి. కానీ ఇప్పుడు గోదావరి అమ్మ కాలుష్యం వల్ల నీరు త్రాగిన ప్రజలు భయంకరమైన కాన్సర్ వ్యాధులు, కిడ్నీ వ్యాధులు, లివర్ వ్యాధులు, గుండె వ్యాధులు, ఇతర వైరస్ సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. మత్స్య సంపద అంతరించిపోతుంది. జలజీవరాసులు మృత్యువాత పడుతున్నాయి. పంటకాలువలు, పంటపొలాలు, పొల్యూషన్ అవుతున్నాయి అని ఆందోళన చెంది ప్రజలకు భవిష్యత్తులో జరగబోవు అనర్ధాల గురించి పుష్కరాలకు స్నానం ఆచరించడానికి విచ్చేయు భక్తులకు వ్యాపించబోయే అనారోగ్య సమస్యలు గమనించి పూర్తి స్థాయిలో కాలుష్య రహితంగా పుష్కరాలు నిర్వహించాలని నడుం కట్టినందుకు ఉపముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము.

గోదావరీ నదీ కాలుష్యం వల్ల మత్స్య సంపద అంతరించిపోతుంది. వరదల సమయంలో అరుదుగా దొరికే పులస చేపలు అంతరించిపోతున్నాయి.

గోదావరి నదిని పవిత్రతను ఒక త్రివేణి సంగమంలా, ఒక వారణాసి గంగా నదిలా, స్వచ్ఛ గోదావరిగా మార్చి పవిత్ర పుష్కరాలు జరిపించడానికి, ఆరు జిల్లాల్లో గోదావరి నదిని పవిత్రంగా చేయడానికి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ద్వారా రూ.100 కోట్ల రూపాయలు వారి మంత్రిత్వ శాఖ నుండి నిధులు మంజూరు చేసినందుకు వారికి గోదావరి నదీ పరివాహక ప్రజలందరి తరపున ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. పుష్కరాలు జరిగే ప్రదేశాలకు అందుబాటులో ఉన్న పంచాయతిలను పుష్కర స్వర్ణ పంచాయతీలుగా మార్చి పుష్కరాలకు వచ్చే భక్తులకు కావలసిన సదుపాయాలు ఏర్పాటు చేయుటకు ప్రభుత్వ అధికారులను అదేసించినందుకు ఉపముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. 2027 పుష్కరాల నిమ్మిత్తం మునికూడలి ఘాట్ ను మోడల్ ఘాట్ గా తయారుచేయాలని నిర్ణయం అద్భుతమైనది. వారికి మా రాజానగరం నియోజకవర్గం ప్రజలందరి తరపున ఎంతో రుణపడి ఉంటామని మనస్ఫూర్తిగా తెలియజేస్తున్నాను. 2027 పవిత్ర గోదావరికి జరుగు పుణ్య పుష్కరాలలో జనసేన పార్టీ అధ్యక్షులు రాష్ట్ర ఉపముఖ్యమంత్రివర్యులు శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ గారు పిలుపు మేరకు వారి ఆశయ సాధనలో రాజానగరం నియోజకవర్గం నుండి 25 వేల మంది జనసైనికులు, వీరమహిలలు వాలంటీర్లుగా పుష్కరాలకు విచ్చేయు భక్తులకు అవసరమైన సేవలు అందించడానికి సిద్దంగా ఉన్నామని తెలియజేస్తూ..సేవలందించడానికి మా జనసైనికులు, వీరమహిళలకు అవకాశం కల్పించిన ఉపముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్ కళ్యాణ్ గారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాము.మునికూడలి గ్రామం విశిష్టత : తూర్పు గోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం సీతానగరం మండలంలోని గోదావరి నదీ తీరాన ఉన్న మునికూడలి గ్రామానికి ఒక ఆధ్యాత్మికమైన మరియు పవిత్రమైన చరిత్ర ఉంది. గోదావరి నదిని భూమికి తీసుకువచ్చిన గౌతమ మహర్షి ఈ ప్రాంతంలో తపస్సు చేశారని, ఆయనతో పాటు సప్త ఋషులు మరియు అనేకమంది ఋషులు, మునులు, సాధువులు ఈ నదీ సంగమ ప్రాంతంలో యజ్ఞ యాగాలు, తపస్సులు చేయడం వల్ల ఈ ప్రాంతానికి "మునికూడలి" అనే పేరు స్థిరపడిందని కాలక్రమేణా ఆ ప్రాంతం మునికూడలి గ్రామంగా వెలసిందని పురాణాలు తెలియజేస్తున్నాయి. త్రేతాయుగంలో శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడితో కలిసి వనవాస సమయంలో ఈ ప్రాంతాన్ని సందర్శించారని, అక్కడి గోదావరి తీరంలో స్నానాలు ఆచరించారని స్థానిక ఇతిహాసం. సీతాదేవి ఇక్కడ స్నానం చేయడం వల్లే ఆ ప్రాంతానికి "సీతానగరం" అనే పేరు వచ్చిందని పూర్వీకుల నుండి ప్రజల విశ్వాసం. ఈ ప్రాంతంలో గౌతమీ గోదావరి నదితో పాటు ఉపనదులైన తుల్యభాగ, ఆత్రేయ నదులు కలిసి అంతర్వాహినిగా ప్రవహిస్తాయని పురాణాలు చెబుతున్నాయి. అందుకే ఆ ప్రాంతాన్ని దక్షిణ "త్రివేణీ సంగమం" లేదా "మునికూడలి సంగమం" అని పిలుస్తారు. అలహాబాద్‌లో ఉన్న త్రివేణీ సంగమం ఎంత పవిత్రమైనదో, దక్షిణ భారతదేశంలో ఈ యొక్క మునికూడలి సంగమం కూడా అంతే పవిత్రమైనదని పూర్వీకుల నుండి నమ్మకం. గోదావరి నదికి ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి జరిగే గోదావరి పుష్కరాల సమయంలో మునికూడలి ఘాట్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉంటుంది. ఈ సంగమ స్థానంలో పితృ తర్పణాలు (పిండ ప్రదానాలు) వదిలితే పితృదేవతలకు మోక్షం లభిస్తుందని భక్తుల నమ్మకం.మునికూడలి ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాధాన్యత కలిగిన పవిత్ర పుణ్యక్షేత్రం.ఈ ప్రాంతంలో క్రోధి నామ సంవత్సరం చైత్ర శుద్ధ ఏకాదశి 1124 లో శ్రీ రుక్మిణి సత్యభామా సమేత వేణుగోపాల స్వామి వారి ఆలయం ముప్ప గోపాల చక్రవర్తి అనే మహారాజు , కేశనామాత్యుడు అనే మంత్రి ప్రతిష్ట చేసినట్లు చారిత్రాత్మిక ఆధారాలు పురాణ ఇతిహాసాలు ద్వారా తెలియజేస్తున్నాయి. ఇక్కడ శివకేశవుల అభేదత్వానికి నిదర్శనంగా శ్రీ పార్వతీ సమేత సోమేశ్వర స్వామి వారి (స్ఫటిక లింగం) ఆలయం కూడా ఉంది. ఇక్కడ శివలింగం పౌర్ణమి కి లేత గోధుమ రంగులోను, అమావాస్యకి ముదురు నీలం రంగులోకి మారతారని స్థానిక ప్రజలు చెబుతుంటారు.

ఇప్పటికీ కూడా బ్రహ్మ ముహూర్తంలో మునులు స్నానమాచారిస్తారని పురాతన కాలం నుండి స్థానిక ప్రజలు నమ్మకం.

ఇంతటి ఘనమైన వైభవం కలిగినటువంటి మునికూడలి ఘాట్ ని "మోడల్ పుష్కర్ ఘాట్" గా నిర్మాణం చేయాలని మన రాష్ట్ర ఉపముఖ్యమంత్రివర్యులు మాన్యశ్రీ శ్రీ పవన్ కళ్యాణ్ నిర్ణయం చారిత్రాత్మకం. అంతటి విశిష్టత మరియు చారిత్రాత్మకమైనటు వంటి ఘాట్ ను "మోడల్ పుష్కర్ ఘాట్ " తీర్చిదిద్దాలని ఉపముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారి తీసుకున్నటు వంటి నిర్ణయం చారిత్రత్మకమైనదిగా పండితులు, ఆధ్యాత్మిక వేత్తలు వర్ణిస్తున్నారు. వారికి మా రాజా నగరం నియోజకవర్గం ప్రజలందరి తరపున శిరస్సు వంచి పాదాభివందనాలు తెలియజేస్తున్నాను.

యాక్సిడెంట్ ల నివారణే లక్ష్యం - ఎస్సై గోకవరం

ప్రమాద హెచ్చరిక సూచి డ్రమ్ములు ఏర్పాటు

గోకవరం మే 31(వార్త నిర్భయం)

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నట్లు గోకవరం ఎస్సై వి. ఎన్.వి.పవన్ కుమార్ ఆదివారం తెలిపారు. దీనిలో భాగంగా మండలంలోని వీరలంకపల్లి గ్రామ కూడలిలో ప్రమాద హెచ్చరిక సూచి డ్రమ్ములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాహనదారులు కూడలి దాటేటప్పుడు ఖచ్చితంగా ఈసూచీల అనుసరించి రోడ్డు దాటాలని తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను వ్యక్తిగత క్రమశిక్షణతో పాటించాలని అప్పుడే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యం అవుతుందని ఆయన అన్నారు.

రాజమండ్రికి మరో మణిహారం కానున్న మహాలక్ష్మి మార్కెట్...

--అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో శరవేగంగా నిర్మాణం...

--మార్కెట్ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే గోరంట్ల...

రాజమండ్రి మే 31 (వార్త నిర్భయం)

రాజమండ్రికి మరో మణిహారం మహాలక్ష్మి మార్కెట్ అవుతుందని రూరల్ శాసనసభ్యులు శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. ఈరోజు మోరంపూడి జంక్షన్ వద్ద ఉన్న మహాలక్ష్మి మార్కెట్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే గోరంట్ల పరిశీలించారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో శర వేగంగా మార్కెట్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని, సుమారు 400 షాపులతో అన్ని రకాల వ్యాపార సంస్థలతో అతి పెద్ద మార్కెట్ గా అవతరించబోతుందని తెలిపారు. పార్కింగ్, రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ వంటి సదుపాయాలతో మోడ్రన్ మార్కెట్ గా అవుతుందని, రాబోయే రోజుల్లో సిటీ నలుమూలల నుండి అనేక వ్యాపారాలు ఇక్కడికి వస్తాయని ఆయన అన్నారు. ఆధునిక అవసరాలకు అనుగుణంగా రూపుదిద్దుతూ వ్యాపారాలు మరియు వినియోగదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా నిర్మాణ పనులు జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మహాలక్ష్మి మార్కెట్ అధ్యక్షులు నిమ్మలపూడి గోవిందు, కార్యదర్శి గొల్లపూడి కామేశ్వరరావు, కోశాధికారి భవర్లాల్, గౌరవ సలహాదారులు కూర్మదాసు ప్రభాకర్, కోటా సుబ్రహ్మణ్యం, వల్లేపల్లి బాబు ఖాన్ చౌదరి, చల్లా శివ, నాగేంద్ర, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వేద హాస్పటల్ లో మహిళ కడుపులో పెరిగిన రెండు కేజీల బరువున్న కనితి ని తొలగించిన డాక్టర్ లక్ష్మి మృదుల

రాజమండ్రి మే 31 (వార్త నిర్భయం)

రాజమహేంద్రవరం వేద హాస్పిటల్స్ మహిళా డాక్టర్ లక్ష్మీ మృదుల ,ప్రముఖ గైనకాలజిస్ట్ , ఒక మహిళ కడుపులో పెరిగిన రెండు కేజీల పైనే బరువన్న కనితిని శస్త్ర చికిత్స చేసి తొలగించారు.విశాఖపట్నం సీతమ్మ దారకు చెందిన కే. అప్పలకొండ ,45, కనితిని మోస్తూ రెండు సంవత్సరాలుగా బాధపడుతోంది .తోగమ్మిలో ఉంటున్న తన సోదరి ద్వారా అప్పలకొండ రాజమహేంద్రవరం వేద హాస్పటల్ ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మీ మృదుల ని సంప్రదించారు అనంతరం అన్ని పరీక్షలు నిర్వహించి శాస్త్రచికిత్స చేసి కనితిని తొలగించారు. ఈ సందర్భంగా డాక్టర్ మృదుల మాట్లాడుతూ కనితి తొలగించక ముందు ఆమె అనారోగ్యంతో బాధపడుతూ ఉండేదని .ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నారని తెలియజేశారు.

రేవంత్ రెడ్డి పాలనలో భూ అక్రమాలు ప్రజాధనం దోపిడి..

వనపర్తి జిల్లాలో రెడ్ల రాజ్యాన్ని కూల్చి బీసీ రాజ్యాన్ని నిర్మిస్తాం

90 శాతం ప్రజలకు రాజ్యాంగ హక్కులు కల్పించడంలో ప్రభుత్వం విఫలం.

సామాజిక న్యాయం కోసం పోరాటం - జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్.

వనపర్తి బ్యూరో మే 31 (వార్త నిర్భయం)

వనపర్తి జిల్లా కేంద్రంలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ పాలిటెక్నిక్ ప్రాంగణంలో వనపర్తి జిల్లా ధర్మ సమాజ్ పార్టీ మద్దతుతో బీసీ, ఎస్సీ, ఎస్టీ ఆధ్వర్యంలో "ఎవరి కులం ఏంటో వారికంత వాటా" భారీ బహిరంగ పంచాయతీ సభ జరిగింది. ఈ సభకు జిల్లా కన్వీనర్ చిలుక బాలరాజ్ సాగర్ అధ్యక్షత వహించారు.ఈ సభకు ముఖ్య అతిథిగా బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ విశారదన్ మహరాజ్ హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కుల గణన చేసింది కానీ తెలంగాణ రాష్ట్రంలో సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా సామాజిక న్యాయం పాటించడం లేదని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలకు అన్ని రంగాల్లో తీవ్ర నష్టం జరుగుతోందని, వాటిని పరిష్కరించేంతవరకు ఈ వేదిక ప్రభుత్వంపై ఉద్యమిస్తుందని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా వ్యతిరేక విధానాలతో రాష్ట్రవ్యాప్తంగా భూ అక్రమాలు చేస్తూ, ప్రజా ధనాన్ని దోపిడీ చేస్తున్నారని ధ్వజమెత్తారు. 90 శాతం ప్రజల జీవన విధానంలో మార్పులు తెస్తూ, వారికి భారత రాజ్యాంగం ప్రకారం రావాల్సిన రాజకీయ, ఆర్థిక, సామాజిక హక్కులు, అవకాశాలు కల్పించడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.తెలంగాణ గడ్డపై సామాజిక న్యాయం, రాజ్యాధికారం సాధన కోసం అన్ని కులాల ప్రజలు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. వనపర్తి జిల్లాలో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి నేటి వరకు కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతున్న రెడ్డి, వెలమ అహంకారపు రాజకీయ వికృత క్రీడను అంతం చేసి జిల్లాలో బీసీ రాజ్యాన్ని స్థాపిస్తామని ధీమా వ్యక్తం చేశారు.అందుకు అన్ని కులాల నాయకులు ఐక్యంగా కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాఘవేంద్ర ముదిరాజ్, రాష్ట్ర నాయకులు బింగి రాము యాదవ్, కార్తీక్ ఏకలవ్య, కొండన్న యాదవ్, మోహన్ కుమార్ యాదవ్, సతీష్ యాదవ్, బాలయ్య ముదిరాజ్, అహ్మద్ భాషా, చిలుక రేఖ, యోసేపు, రామకృష్ణ, అశోక్, గట్టయ్య, రాములు, ఎల్లయ్య, ఆది సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.